సాక్షి పెద్దపల్లి

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి కొప్పుల ఈశ్వర్, భానుప్రసాద్, బాల్క సుమన్, మమతారెడ్డి, చందర్, నారదాసు, దాసరి

రామగుండాన్ని దత్తత తీసుకుంటా



గోదావరిఖని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన మంత్రి కేటీఆర్ సభకు హాజరైన ప్రజానీకం



కేటీఆర్‌తో కరచాలనం కోసం..



పెద్దపల్లి సభకు హాజరైన ప్రజలు

- అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తా
- కొత్తమండలాలు, పంచాయతీలు, బస్‌డిపోలు ఏర్పాటు చేస్తాం
- ఇటు కారు పరుగులు.. అటువైపు బేకారు
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు వరాలు

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని/పెద్దపల్లిరూరల్: 'జిల్లాలోని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించండి.. పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తాం.. రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారిస్తాం' అని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అభయం ఇచ్చారు. ఆదివారం రామగుండం, పెద్దపల్లిలో ఐటీ టవర్, ఇండస్ట్రియల్ పార్క్‌తోపాటు పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. 'ప్రధాని మోదీకి తెలివి లేదు.. ఆయనకు స్క్రిప్ట్ ఎవరు రాసిస్తున్నారో తెలియదు.. ప్రధానికి ఇంగిత జ్ఞానం ఉంటే రెండుసార్లు రుణమాఫీ చేసిన కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి.. కరోనా కష్టమొచ్చినా.. రూ.37వేల కోట్ల రుణమాఫీ చేశాం' అని మంత్రి గుర్తుచేశారు. గుజరాత్ వ్యాపారుల తెలివితేటలు తెలంగాణ రాష్ట్రంలో పనికిరావని హెచ్చరించారు. 'ఇటు ఉరుకుతున్న కారు.. అటూ అంతాబేకారు' అని ప్రతిపక్షాలపై మండిపడ్డారు.

రామగుండాన్ని దత్తత తీసుకుంటా..

'ఒక్కటే కండీషన్.. ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను పెద్దపల్లి జిల్లాలోనే భారీ మెజార్టీతో గెలిపించాలి.. మంత్రి కొప్పుల ఈశ్వర్ కంటే మెజార్టీతో గెలిపిస్తే రామగుండాన్ని దత్తత తీసుకుని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా' అని మంత్రి అన్నారు. తెలంగాణ వచ్చినంక సింగరేణి బాగుపడ్డదా? చెడిపోయిందా? కార్మికులు ఆలోచించాలన్నారు. రూ.వందల కోట్ల లాభాలు, రూ.వేలకోట్లకు చేరుకున్నాయని తెలిపారు. రూ.2,222కోట్లు లాభాలు ఆర్జించి దేశంలోనే సింగరేణి అగ్రగామిగా నిలిచిందని ప్రశంసించారు. ఒక్కచాన్స్ ఇస్తే అద్భుతాలు చేస్తామంటున్నా.. 11 చాన్స్‌లు ఇప్పటికే ఇచ్చారని.. ఏం చేశారని కాంగ్రెస్ పార్టీని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.

మా ఒకేఒక్క నాయకుడు దాసరి..

'పెద్దపల్లిలో కాంగ్రెస్ నాయకుడు ఉన్నాడు రేవంత్ రెడ్డికి దగ్గర.. అతను గెలిచినంక కారుకి పోతానని అక్కడిక్కడ చెప్పుతున్నాడు అంటా.. మేము బాజాప్తా రాజకీయాలు చేస్తాం.. పెద్దపల్లిలో మా పార్టీ ఒకేఒక్కనాయకుడు దాసరి మనోహర్‌రెడ్డి మాత్రమే' అన్నారు. దాసరిని మళ్లీ గెలిపిస్తే పెద్దపల్లిలో బస్ డిపో, కొత్తగా కొలనూర్, గర్రెపల్లి, పెద్దపల్లి అర్బన్, రూరల్ మండలాలుగా చేస్తాం.. శ్రీరాంనగర్, జగ్గయ్యపల్లి, ఉషన్నపల్లిని గ్రామ పంచాయతీలుగా మారుస్తాం.. జిల్లాను చేసినం.. కొత్తగా వీటిని మండలాలు, పంచాయతీలు చేయటం పెద్దవిషయం కాదు' అన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్‌కు అవసరమైతే మరోఇరవై, ముప్పయి కోట్లు ఇస్తాం. ఇక్కడి యాదవులు, పద్మశాలీలు, ముదిరాజ్, మున్నూరు కాపు, గౌడ్స్, విశ్వబ్రాహ్మణుల కోసం 30 గుంటల చొప్పున స్థలం కేటాయిస్తున్నామని తెలిపారు.

కారులో జోష్..

గోదావరిఖని: కేటీఆర్ బహిరంగసభ కారులో జోష్ నింపింది. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం గులాబీజెండాలు, కేటీఆర్ ఫ్లెక్సీలతో నిండిపోయింది. ఆశించిన దానికన్నా పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావడంతో స్టేడియం కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను గెలిపించుకుంటే రామగుండం నియోజకర్గాన్ని దత్తత తీసుకుని గెలిపిస్తాననే ప్రకటన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఎన్నికలు సమీస్తున్న క్రమంలో కేటీఆర్ పర్యటన, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలను స్థానిక ఎమ్మెల్యేకు అనుకూల అంశంగా చర్చించుకుంటున్నారు. సభకు తరలివచ్చిన జనాన్ని చూసి కేటీఆర్ కూడా జోష్‌గా మాట్లాడారనే చర్చ మొదలైంది.

అభివృద్ధి పనులు ప్రారంభం

గోదావరిఖని: మంత్రి కేటీఆర్.. స్టేడియంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈమేరకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. రూ.60 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇండస్ట్రియల్ పార్క్, రూ.30 కోట్లతో నిర్మించే ఐటీ టవర్, రూ.100 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టే రామగుండం పట్టణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 58, 76 జీవో కింద గృహలక్ష్మి లబ్ధిదారులు, కుర్షుకమ్మి భూముల లబ్ధిదారులు 473మందిలో ఆరుగురికి పట్టాలు అందజేశారు. ఆ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 54 మంది మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులు, గృహలక్ష్మి తొలివిడతలో రామగుండం నియోజకవర్గానికి తొలిదశలో మంజూరు చేసిన ఇళ్లు, దళితబంధు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి వెంట కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, అధికారులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి అంటే ఏంటో చేసిచూపించాం

పెద్దపల్లిరూరల్: కాంగ్రెసోళ్లకు 60 ఏళ్లు అధికారం ఇస్తే చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసి చూపించిందని మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. సీఎం కేసీఆర్ సింహంలా రంగంలోకి దిగితే కాంగ్రెస్ పార్టీ నక్కలు దౌడోదౌడ్ అనుకుంటూ పరుగెత్తడం ఖాయమన్నారు. మూడోసారి పోటీపడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని గెలిపించి కేటీఆర్‌కు కానుకగా ఇద్దామని అన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలోనే అందరికీ మేలు

సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే అన్నివర్గాలకు మేలు జరిగిందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. రైతులకు అన్నివిధాలా అందే పథకాలు అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌దే అన్నారు. కానీ, కాంగ్రెసోళ్లు అమలుకు సాధ్యంకాని హామీలతో వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని దాసరి కోరారు.

ప్రత్యేక ఆకర్షణగా కళాకారులు

మంత్రి కేటీఆర్ సభకు సాంస్కృతిక కళాకారులు తలపాగాలు ధరించి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గాయకులు మధుప్రియ, మిట్టపల్లి సురేందర్ పాటలు ఆకట్టుకున్నాయి.

గోదావరి నదిపై కరకట్ట నిర్మించాలి



- మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే చందర్ వినతి

గోదావరిఖని: భారీ వర్షాలు కురిసే సమయాల్లో గోదావరి నది బ్యాక్‌వాటర్‌తో నగరంలోని చాలాకాలనీలు నీట మునుగుతున్నాయని, దీని నివారణ కోసం నదీతీరం వెంట కరకట్ట నిర్మించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఆదివారం స్థానిక సింగరేణి స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి కేటీఆర్‌కు ఆయన పలు సమస్యలు విన్నవించారు. రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు రెండుచోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాలని విన్నవించారు. వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ప్రారంభించడానికి జీవో జారీ చేయాలని విన్నవించారు. పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలోని పాత్రికేయులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరారు. రెల్లి, ఒరియా, మూల కులస్తులకు కులధ్రువీకరణ పత్రాలు జారీచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటిపై మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.



శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్



సింగరేణి స్టేడియం ద్వారం వద్ద తనిఖీలు



పట్టాదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తూ..



పోలీసుల తనిఖీల్లో లభించిన గుట్కాలు

సభ సైడ్‌లైట్స్

- మంత్రి కేటీఆర్ ప్రయాణించిన హెలిక్యాప్టర్ నిర్దేశిత సమయం కన్నా ముందే పెద్దపల్లి కలెక్టరేట్‌కు చేరుకుంది.
- గోదావరిఖని సభ ముగియగానే రోడ్డు మార్గం ద్వారా మంత్రి కేటీఆర్ పెద్దపల్లి సభకు సాయంత్రం 4.20 గంటలకు చేరుకున్నారు.
- పెద్దపల్లి సభావేదికపై స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో వివిధ అంశాలపై మంత్రి కాసేపు చర్చించారు.
- తండ్రికి తగ్గ తనయుడు కేటీఆర్ అని.. సాంకేతిక రంగాన్ని పరుగెత్తిస్తూ యువతకు పెద్దన్నగా నిలుస్తున్నారని ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు.
- అన్నా.. అని పిలిస్తే నేనున్నా అంటూ అడగగానే అభివృద్ధి పనులకు సహకరిస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పొగడ్తలతో ముంచెత్తారు.
- అందరూ బాగున్నారా.. అని కేటీఆర్ తన ప్రసంగం ఆరంభించారు.
- ప్రధాని నరేంద్రమోదీని విమర్శిస్తూ.. ప్రధాని.. కాదు అదానీ అని అంటున్నార న్నారని మంత్రి ఎద్దేవా చేశారు.
- నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానకు అనే రోజులను సీఎం కేసీఆర్ తన పాలనతో మరిపించి.. నేను సర్కారు దవాఖానకే పోతా.. అనేలా తీర్చిదిద్దారని అన్నారు.
- ఇక్కడ ట్రినిటి బడిల చదువు చెబుతున్నట్లు.. రాష్ట్రంలో గురుకుల, మోడల్ స్కూళ్లలో సర్కారు ఉచితంగానే చదువు చెప్పిస్తుందన్నారు.
- ప్రసంగం పూర్తికాగానే కేటీఆర్ రోడ్డు మార్గం ద్వారా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ నుంచి హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్ తిరుగు పయనమయ్యారు.

– పెద్దపల్లిరూరల్



కేటీఆర్‌కు గొర్రెపిల్ల బహూకరిస్తున్న యాదవులు



బతుకమ్మలతో సభకు తరలి వస్తున్న మహిళలు



కేటీఆర్, దాసరికి గజమాలతో సన్మానం



స్టేడియంలో పోలీసుల తనిఖీలు

న్యూస్‌రీల్

మల్లన్నకు మొక్కులు



బోనం తయారు చేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. కోనేటిలో స్నానాలు ఆచరించారు. స్వామివారికి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారి పేరిట మొక్కుకున్న భక్తులు హుండీలో కానుకలు వేశారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేశారు. బోనాలు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో సదయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కౌశిక్ హరి



హరి దంపతులను ఆహ్వానిస్తున్న కేటీఆర్

గోదావరిఖని: మంత్రి కేటీఆర్ పర్యటనలో పలువురు బీఆర్‌ఎస్ తీర్థం తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి, ఆయన సతీమణి, కార్పొరేటర్ కౌశిక్ లత బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ గాదెం విజయ, నాయకుడు గాదెం నందు, కార్పొరేషన్ పరిధిలోని 27 డివిజన్లకు చెందిన మహిళా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ప్రకటించారు.

ఇద్దరు జెడ్పీటీసీలు గైర్హాజరు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి నియోజకవర్గంలో ఆదివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంత్రి కేటీఆర్ సభను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేటీఆర్ బహిరంగ సభ సక్సెస్ చేసి ఎన్నికల శంఖారావం పూరించాలనుకున్నారు. కేటీఆర్ సభలతో రామగుండం కారులో జోష్ పెరగ్గా, పెద్దపల్లిలో అసమ్మతి బయటపడింది. సభకు అధికార పార్టీ జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, పెద్దపల్లి జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి గైర్హాజర్ కావడం చర్చనీయాంశంగా మారింది. వారిద్దరూ బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతుండడమే కారణమని, అందుకే సభకు రాలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో కేటీఆర్ పర్యటన సందర్భంలో బీఆర్‌ఎస్ నేతలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా, ఈసారి కేవలం ఎమ్మెల్యే మాత్రమే ఫ్లెక్సీలు తనపేరు మీద ఏర్పాటు చేయించారు. మిగతా ద్వితీయశ్రేణి నేతల సందడి పెద్దగా కనిపించలేదు. అలాగే సభ ప్రాంగణం పూర్తిస్థాయిలో నిండకపోవడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

శంకుస్థాపనలు.. లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్..

సాక్షి, పెద్దపల్లి: మంత్రి కేటీఆర్ ఆదివారం జరిగిన సభలో ప్రభుత్వ జీవో 58 కింద లబ్ధిదారులకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గృహలక్ష్మి పథకం మొదటి విడత కింద పెద్దపల్లి నియోజకవర్గంలో మంజూరు చేసిన ఇళ్లు, దళితబంధు, గృహలక్ష్మి, గొర్రెల పంపిణీ, ఆసరా పింఛన్ల మంజూరు పత్రాలను పలువురు లబ్ధిదారులకు మంత్రి కేటీఆర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్, పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ వైభవ్ గైక్వాడ్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



మాట్లాడుతున్న నాయకులు


పెద్దపల్లిరూరల్: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, ప్రధానకార్యదర్శిగా రంగు రవి, అసోసియేట్ అధ్యక్షులుగా ఉపేందర్‌రెడ్డి, పూర్ణచందర్‌రావును ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్, అంజయ్య, జాయింట్ సెక్రటరీలుగా వెంకటరమణ, ఎల్లయ్య, సతీశ్‌కుమార్, సంపత్, కోటేశ్, కోశాధికారిగా రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీనివాస్, సతీశ్, నరేందర్, తిరుపతిరెడ్డి, తాజొద్దీన్‌తోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

ఏక్ రుపియా వాలా 2.0

- రెండేళ్లలో రూ.వందల కోట్లకు పడగలెత్తిన వ్యాపారి
- కరీంనగర్ నుంచి నేరుగా తమిళనాడుకు పీడీఎస్ రైస్
- సైకిళ్ల నుంచి గూడ్స్ రైళ్లలో తరలించే స్థాయికి ఎదిగిన వైనం
- రెండేళ్ల క్రితం డీజీపీ కార్యాలయం ఆగ్రహంతో అండర్‌గ్రౌండ్‌కు..
- మిల్లర్లతో కుమ్మక్కై సీఎమ్మార్ బియ్యం కూడా ఎగుమతి
- 'పుష్ప' తరహాలో మహారాష్ట్ర, తమిళనాడుకు విస్తరించిన నెట్‌వర్క్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అడవిలో చెట్లు కొట్టుకునే కూలోడు అంతర్జాతీయ స్మగ్లర్‌గా ఎదిగిన కథ 'పుష్ప' సినిమా. వాస్తవానికి అలాంటి ఘటనలు నిజ జీవితంలో జరగవు. కానీ.. ఉమ్మడి కరీంనగర్‌లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి.. అధిక ధరలకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారిని చూస్తే నిజమే అనిపిస్తోంది. 'ఏక్ రూపాయ్‌వాలా' కోడ్ నేమ్‌తో అధికారులు ముద్దుగా పిలుచుకునే ఈ స్మగ్లర్ నెట్‌వర్క్ ఒకప్పుడు పాత కరీంనగర్ జిల్లాకే పరిమితం. నేడు ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లా దాటి మహారాష్ట్రలో ఎంటర్ అయ్యాడు. ఆ సమయంలో అతడి దందా.. పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న తీరును 'సాక్షి' దినపత్రిక 'ఏక్ రూపాయ్‌వాలా' శీర్షికన వరుస కథనాలు ప్రచురించింది. వీటిపై డీజీపీ కార్యాలయం స్పందించి దాడులకు ఆదేశించింది. అప్పటి కరీంనగర్ సీపీ సత్యనారాయణ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు వరుస దాడులతో విరుచుకుపడ్డాయి. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని బైండోవర్ కూడా చేశాయి. దీంతో కొంతకాలం సదరు వ్యాపారి, అతని అనుచరులు కార్యకలాపాలు నిలిపివేశారు.

సైకిళ్లతో మొదలై..



గూడ్స్ రైళ్లలో తరలించే స్థాయికి..

ఒకప్పుడు గ్రామాల్లో సైకిళ్లపై తిరుగుతూ.. పీడీఎస్ బియ్యాన్ని సేకరించి వాహనాల్లో తరలించడంలో ఏక్ రూపాయ్‌వాలాది అందెవేసిన చేయి. అప్పట్లో హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికలు వరుసగా రావడం.. పత్రికల్లో వరుస కథనాలు రావడంతో అతడి వ్యాపారం సుప్తావస్థలోకి వెళ్లింది. ఆ తర్వాత కొత్త పద్ధతిలో వ్యాపారంలోకి దిగాడు. అధికారులకు లంచాలిస్తూ.. మహారాష్ట్రకు బియ్యం తరలించడం కంటే అధికారికంగానే ఎగుమతి చేయాలని నిర్ణయించాడు. అదునుకోసం చూస్తున్న అతడికి తమిళనాడు తెలంగాణ ప్రభుత్వానికి బియ్యం కోసం చేసిన వినతి ఆసరాగా దొరికింది. రూ.37.50కు కిలో చొప్పున కావాలని తమిళనాడు కోరడం.. ఆ డీల్ రద్దు కావడంతో 'ఏక్ రూపాయ్‌వాలా' రంగంలోకి దిగాడు. కిలో రూ.31.50కే ఇస్తామని డీల్ కుదిర్చినట్లు సమాచారం. ఎగుమతికి కావాల్సిన బియ్యంలో తనవంతుగా పీడీఎస్ రైస్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అతడికి కావాల్సినంత బియ్యం ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు కూడా సమ్మతించారని తెలిసింది. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ఉన్నట్లు తెలిసింది. వారం వ్యవధిలో దాదాపు ఐదు వేల టన్నుల బియ్యాన్ని కరీంనగర్ నుంచి గూడ్స్ ద్వారా ఎగుమతి చేసినట్లు సమాచారం. వీటివిలువ దాదాపు రూ.160 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. డిమాండ్ నేపథ్యంలో మరోరూ.60 కోట్ల విలువైన 2వేల టన్నుల బియ్యాన్ని తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు మరో గూడ్స్‌రేక్ (కొన్ని బోగీలతో కూడిన రైలు)ను ఇప్పటికే బుక్‌చేశారని సమాచారం. ఇంత జరుగుతున్నా.. సివిల్ సప్లయి అధికారులు, పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.

అటెన్షన్ డైవర్షన్‌లో అందెవేసిన చేయి..

తెలంగాణ, మహారాష్ట్రలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో 'ఏక్ రూపాయ్‌వాలా'ది అందె వేసిన చేయి. అచ్చం వీరప్పన్ తరహాలో.. పోలీసులు బందోబస్తుల్లో నిమగ్నమయ్యే సందర్భాల్లోనే భారీ వాహనాల్లో టన్నుల కొద్దీ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటిస్తాడు. ఇపుడు బహిరంగ దందా చేస్తున్న నేపథ్యంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. తమపై సివిల్ సప్లయిస్, పోలీసుల కన్ను పడకుండా.. గణేశ్ ఉత్సవాల్లో అధికారులు తలమునకలైన సందర్భాన్ని వాడుకుని రైలు ద్వారా తెలివిగా.. పకడ్బందీగా తమిళనాడుకు బియ్యం ఎగుమతి చేశాడు. త్వరలో ఎన్నికలకోడ్ రాబోతోంది. కోడ్ వస్తే వాహన తనిఖీలు పెరుగుతాయి. దానికి ముందే రెండోవిడత సరుకు పంపేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని సమాచారం. కిలో రూపాయి బియ్యాన్ని రూ.4 లేదా రూ.5 కమీషన్ చొప్పున విక్రయించే 'ఏక్ రూపాయ్ వాలా' నేడు రూ.వందల కోట్ల వ్యాపారానికి పడగలెత్తిన తీరు సినిమా కథను తలపిస్తోంది.

ఫిర్యాదు వచ్చింది చర్యలు తీసుకుంటాం

కరీంనగర్ నుంచి తమిళనాడుకు సీఎంఆర్ బియ్యం అక్రమంగా వెళ్తున్నాయని మాకు అధికారికంగా ఫిర్యాదు వచ్చింది. వెంటనే అడిషనల్ కలెక్టర్, సివిల్ సప్లయీస్ ఉన్నతాధికారులకు చేరవేశాను. వారు స్పందించి రంగంలోకి దిగారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్ సింగ్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్

'సదాశయం'తో పునర్జన్మ ఇస్తున్నారు..

- నేటితో 15ఏళ్లు పూర్తిచేసుకోనున్న సదాశయ స్వచ్ఛంద సంస్థ

కోల్‌సిటీ(రామగుండం): చీకటి జీవితాల్లో వెలుగులు నింపాలనే 'సదాశయం'తో పద్నాలుగేళ్ల క్రితం పురుడుపోసుకున్న గోదావరిఖనిలోని సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ.. సోమవారం 15వ వార్షికోత్సవంలోకి అడుగిడుతోంది. మరణానంతరం నేత్ర, అవయవ, శరీరదానం చేయడంపై ఆ సంస్థ ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. సదాశయంతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం.. సింగరేణి ఉద్యోగుల ప్రయత్నంతో సఫలమైంది. వందలాది మంది తమ మరణానంతరం నేత్ర, అవయవ, శరీరదానం చేసేందుకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలు సమర్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కోటి మార్కెట్ సమీప అమర్‌చంద్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సదాశయ ఫౌండేషన్ వార్షికోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సదాశయం స్ఫూర్తి..

- కాకతీయ మెడికల్ కాలేజీకి శరీరదానం చేసిన కాళోజీ స్ఫూర్తితో 2008 అక్టోబర్ 2న గోదావరిఖని యైటింక్లయిన్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి టి.శ్రవణ్‌కుమార్ దంపతులు సదాశయ ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టారు.



శ్రవణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

- శ్రవణ్‌కుమార్‌తో కలిసిన మరోసింగరేణి ఉద్యోగి సీహెచ్ లింగమూర్తి ప్రధాన కార్యదర్శి హోదాలో అనేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.

మరణించినా మహోపకారం..

మరణించినా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే సదాశయంతో ప్రజల్లో కలిగించేలా ఫౌండేషన్ కృషి చేస్తోంది. ఇప్పటివరకు 800 మంది వరకు తమ మరణానంతరం నేత్రాలు దానం చేసి సుమారు 1,600 మందికి కంటి వెలుగులు ప్రసాదించారు. 80 మంది బ్రెయిన్‌డెత్‌తో వారి అవయవాలు దానంచేసి వందలాది మందికి పునర్జన్మనిచ్చారు. 90మంది పార్థివదేహాలను మెడికల్ కాలేజీలకు అప్పగించారు. తాజాగా రామగుండంలోని సిమ్స్‌కు నాలుగు పార్థివదేహాలు అప్పగించారు. తమ మరణానంతరం శరీరదానం చేస్తామంటూ 50వేల మందికిపైగా స్వచ్ఛందంగా అంగీకారం ప్రకటించారు.

అబ్బిడిపల్లి గ్రామం ఆదర్శం



నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన కలిగి ఉండడంతో ఓదెల మండలం అబ్బిడిపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. నేను విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న తీరుకు గ్రామస్తులు ముందుకు వచ్చారు. ఊర్లో 542 మంది ఉంటే.. అందులో 421 మంది చనిపోయిన తర్వాత అవయవదానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామపంచాయతీ తీర్మానం కూడా చేసింది.

– మేర్గు భీష్మాచారి, సంస్థ జిల్లా అధ్యక్షుడు

కాళోజీ స్ఫూర్తితో..

మా తమ్ముడు అశోక్‌కుమార్ 2006లో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన నన్ను చాలా కలిచివేసింది. బతికి ఉన్నప్పుడే నేత్ర, శరీరదానం చేయాలని తన భార్యకు చెప్పాడు. మా తమ్ముని కోరిక మేరకు అవయవదానం చేశాం. మా నిర్ణయాన్ని ఇంట్లో వాళ్లు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. కాకతీయ మెడికల్ కాలేజీకి శరీరం దానంచేసిన కాళోజీని స్ఫూర్తిగా తీసుకున్నాం.

– టి.శ్రవణ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని గోపాల్‌రావుపేట కు బీజేపీ సీనియర్ నాయకుడు గాగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కండువాలు కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, సర్పంచ్ అంజయ్య, నాయకులు సందనవేని కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


రజనీకాంత్ (ఫైల్)

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన మేడవేని రజనీకాంత్ (20) అనే ఇంజినీరింగ్ విద్యార్థి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న రజనీకాంత్ 10 రోజుల క్రితం బైక్‌పై కాలేజీకి వెళ్లాడు. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తొలుత కరీంనగర్, తర్వాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మృతుడి తండ్రి బక్కయ్య తెలిపారు.

విపక్ష నాయకుల ముందస్తు అరెస్టు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఆదివారం మంత్రి కేటీఆర్ పర్యటన ఉండటంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు ఉదయమే ముందస్తు అరెస్టు చేశారు. వారిని ఠాణాలకు తరలించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల పర్యటనలు ఉన్నప్పుడల్లా ఇలా అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కాంగ్రెస్ నాయకుడు కందుల అశోక్ అన్నారు. పోలీసులు ఈ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు.

ముగిసిన కుష్ఠు వ్యాధి సర్వే


సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

- ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నిర్వహణ
- 2022 నుంచి ఇప్పటివరకు 20 కేసులు నమోదు
- ఇంకా పెరిగే అవకాశాలున్నాయన్న వైద్య, ఆరోగ్య శాఖ
- మందులు వాడాలంటున్న అధికారులు

సుల్తానాబాద్: లెప్రసీ(కుష్ఠు వ్యాధి) రహిత సమాజంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. 2030 వరకు మన దేశంలో లెప్రసీని పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా కేసులు తగ్గకపోగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా దాదాపు 20 వరకు యాక్టివ్ కేసులు ఉంటున్నాయి. వ్యాధిగ్రస్తులు, అనుమానితులను గుర్తించేందుకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ గ్రామాలు, పట్టణాల్లో సర్వే నిర్వహించింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ప్రాథమిక పరీక్షలు చేసి, అనుమానం ఉంటే నిర్ధారణ పరీక్షలు జరిపారు.

1,97,628 ఇళ్లకు వైద్య సిబ్బంది

జిల్లాలో 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లు సర్వే చేపట్టారు. 1,97,628 ఇళ్లకు వెళ్లి, 6,86,581 మంది వివరాలు సేకరించారు. 1,942 మంది అనుమానితులను గుర్తించారు. 1,142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 20 మంది వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయ్యింది. వీరిలో ఎక్కువ మంది కార్మికుల కుటుంబసభ్యులే. అవగాహన లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వల్లే వ్యాధి వచ్చిందని అధికారులు తెలిపారు. జిల్లాలో 2022 నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు 20 కేసులు నమోదవగా మరిన్ని పెరిగే అవకాశాలు లేకపోలేదని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. కుష్ఠు బాధితులకు మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా వ్యాధిని నయం చేస్తారు. తీవ్రతను బట్టి 6 నెలలు, 12 నెలలపాటు మందులు వాడాల్సి ఉంటుంది.

వ్యాధి నిర్మూలనకు చర్యలు



లెప్రసీ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం. ఏటా అనుమానితులను ప్రాథమిక దశలోనే గుర్తించి, పరీక్షలు నిర్వహిస్తున్నాం. మందులు అందిస్తున్నాం. ఈ ఏడాది సర్వే జరిపి, 20 మందిని గుర్తించాం. వారు కోలుకునేందుకు అందుబాటులో ఉండి, వైద్య సేవలందిస్తున్నాం.

– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

ఆర్జీ–1లో 97 శాతం బొగ్గు ఉత్పత్తి

- జీఎం చింతల శ్రీనివాస్


జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి, రవాణాలో కలిసికట్టుగా ముందుకుసాగాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటలో అన్నారు. ఏరియాలో 3.17 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 3.07 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి, నిర్దేశిత లక్ష్యాల్లో 97 శాతానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిందని, రానున్న రోజుల్లో వంద శాతం లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఏరియాలో ఇప్పటివరకు 1,619 మంది ఉద్యోగులకు మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా 1,397 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. సీపీఆర్ఎంఎస్ స్కీం ద్వారా 5,353 మందికి గాను 5,021 మంది కార్డులు తీసుకున్నారని, మరో 332 మంది రెన్యువల్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ ఏడాది చివరిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా జీడీకే–5 ఓసీపీలో హై కెపాసిటీ మోటార్లు ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి డాడ్జ్ బాల్ ఎంపిక పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీలో ఆదివారం రెండో రాష్ట్రస్థాయి డాడ్జ్ బాల్ ఎంపిక పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని ఎల్లోరాలో జరిగే జాతీయ పోటీలలో వీరు పాల్గొంటారని స్టాఫ్ సెక్రటరీ ఓదెలు తెలిపారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, డాడ్జ్ బాల్ రిఫరీ బోర్డు చైర్మన్ సత్యనారాయణ, డాడ్జ్ బాల్ అసోసియేషన్ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ అనిల్, నేషనల్ సెక్రటరీ నవీన్, ఎస్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎంఏ.సమద్, పీఈటీలు సంపత్, స్రవంతి, నవీన్ పాల్గొన్నారు.

ప్రాణం పోసిన డాక్టర్‌పై అభిమానం

- 24 ఏళ్లుగా బియ్యం ఇస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు


తల్లిదండ్రులతోపాటు డాక్టర్‌కు బియ్యం ఇస్తున్న రాయమల్లు దంపతులు

కోల్‌సిటీ: తల్లిదండ్రులతోపాటు ప్రాణం పోసిన డాక్టర్‌కు గోదావరిఖనిలో సింగరేణి విశ్రాంత కార్మికుడు ఏటా పెతర అమావాస్యను పురస్కరించుకొని, బియ్యం ఇస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. ఆదివారం కూడా బియ్యం ఇచ్చాడు. స్థానిక ఎల్బీనగర్‌కు చెందిన కడమండ రాయమల్లు సింగరేణిలోని 7బీ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేసి, ఉద్యోగ విరమణ పొందాడు. ఆయనకు భార్య రాజీరమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఉద్యోగం చేస్తున్న సమయంలో రాయమల్లుకు తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. చివరికి మార్కండేయ కాలనీలోని డాక్టర్ సునీల్‌సాయినాథ్‌రెడ్డికి చూపించడంతో ఆయన వెంటనే ఆపరేషన్ చేశారు. మూడు రోజుల్లోనే అతను కోలుకున్నాడు. ఆ వైద్యుడు రాయమల్లు వద్ద నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. ఆపరేషన్ చేసిన రెండు నెలలకు 1999 మార్చి 28న డాక్టర్ సునీల్‌సాయినాథ్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. తనకు ప్రాణం పోసిన వైద్యుడిని దేవునిగా భావించిన రాయమల్లు అప్పటినుంచి ఏటా తన తల్లిదండ్రులతోపాటే డాక్టర్‌కు బియ్యం ఇస్తున్నాడు.

పొలాలను ముంచెత్తుతున్న వరద

- ఓసీపీ–3 మట్టి కుప్పలే కారణం
- పదేళ్లుగా వానాకాలంలో ఇదే పరిస్థితి
- నష్టపోతున్న రాజీవ్‌నగర్ తండా, అల్లూరు రైతులు
- న్యాయం చేయాలని వేడుకోలు


వరద నీరు, ఇసుకతో నిండిన పొలాలు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ రాజీవ్‌నగర్ తండా రైతులకు అల్లూరు శివారులో పొలాలున్నాయి. ఏటా వానాకాలంలో వరి నాట్లు వేశాక వరద నీటితో మునిగిపోతున్నాయి. సింగరేణి ఆర్జీ–2 యాజమాన్యం ఓసీపీ–3 విస్తరణలో భాగంగా ఈ పొలాలకు సమీపంలో ఓబీ మట్టి కుప్పలను పోయడంతో చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు వచ్చి చేరుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దగ్గరలోనే మద్దెల, వేపల వాగులు..

అల్లూరు శివారులోని పొలాలకు దగ్గరలో మద్దెల, వేపల వాగుల నీరు ప్రవహిస్తోంది. అల్లూరు వాగు, వీర్లపల్లి నుంచి వచ్చే వరద నీరును కలవడంతో మద్దెల వాగు ఉప్పొంగుతోంది. కానీ, వరద నీరు పోకుండా అడ్డుగా ఓసీపీ–3 మట్టి కుప్పలు వర్షానికి వచ్చి వాగులో చేరడంతో అందులోని ఇసుక, మట్టి పొలాల్లోకి వచ్చి, రైతులు నష్టపోతున్నారు. పదేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని, పలుమార్లు కలెక్టర్, సింగరేణి యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 70 ఎకరాల పొలాల్లో 30 ఎకరాల వరకు నీట మునుగుతున్నాయని అంటున్నారు. వరద నీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని లేదా రైతుల భూములను తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని వేడుకుంటున్నారు.

న్యాయం చేయాలె



మట్టి కుప్పల నుంచి వస్తున్న వరద, రెండు వాగుల నీరు ఒకేసారి వచ్చి, నీళ్ల పొలాలను ముంచుతున్నయ్. ప్రభుత్వ, సింగరేణి అధికారులు పట్టించుకుంటలేరు. మాకు న్యాయం చేయాలె.

– పుల్లయ్య, రైతు, రాజీవ్‌నగర్ తండా

ఏటా నష్టపోతున్నం



పొలాలన్నీ మట్టితో నిండుతున్నయ్. ఏటా పంటలు నాశనమై, రైతులందరం నష్టపోతున్నం. సింగరేణి యాజమాన్యం స్పందించి, పరిహారం చెల్లించాలె. సమస్యకు పరిష్కారం చూపాలె.

– ధరావత్ తులసీరాం, రైతు, రాజీవ్‌నగర్ తండా

పదేళ్ల నుంచి గోస



పంటలు పండక పదేళ్ల నుంచి గోసపడ్తున్నం. పొలాలు వరదలో మునిగి, ఎటుచూసినా ఇసుక కుప్పలే ఉంటున్నయ్. వరద రాకుండా సింగరేణి యాజమాన్యం కాంక్రీట్ గోడ నిర్మించాలె.

– బనావత్ చందు, రైతు, రాజీవ్‌నగర్ తండా

పరిహారం చెల్లించాలి

రైతుల పొలాల్లోకి ఓసీపీ–3 ఓబీ మట్టి, వాగుల ఇసుక చేరి, రైతులు కనీసం ఒక్క పంటనూ పండించుకోవడం లేదు. సింగరేణి యాజమాన్యం వారికి పరిహారం చెల్లించి, ఆదుకోవాలి.

– శంకర్ నాయక్, కార్పొరేటర్

గాయకుడు దయా నర్సింగ్ తల్లి మృతి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంకు చెందిన సినీ గేయ రచయిత, ఉద్యమ గాయకుడు దయా నర్సింగ్ తల్లి మల్లమ్మ(75) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆదివారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

టీచర్ల తప్పుల దిద్దుబాటు

- ర్యాంకుల గోల్‌మాల్‌పై స్పందించిన డీఈవోలు
- 'సాక్షి' వరుస కథనాలపై కదిలిన విద్యాశాఖ
- స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపైనా మొదలైన చర్యలు
- అన్ని డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్ ఆప్షన్ల వెరిఫికేషన్లు


కరీంనగర్‌లో వెరిఫికేషన్‌కు హాజరైన స్పౌజ్ టీచర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు సందర్భంగా వెలుగుచూసిన ర్యాంకుల గోల్‌మాల్, స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఇటీవల జీహెచ్ఎం బదిలీలలో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం అవుతున్న తీరును, టీచర్ల పదోన్నతులు–బదిలీల సందర్భంగా దరఖాస్తుల్లో డీఎస్సీ ర్యాంకులను తప్పుగా నమోదు చేసిన వైనాన్ని 'సాక్షి' గతనెల 23న 'స్పౌజ్ దుర్వినియోగంపై గుర్రు', 29న 'టీచర్ల బదిలీల్లో ర్యాంకుల గోల్‌మాల్' శీర్షికలతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో టీచర్లు చేసిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో జాబితాలను అధికారులు సవరించారు. సిరిసిల్ల జాబితాను సవరించాల్సి ఉంది.

డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్ వెరిఫికేషన్..

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై పాఠశాల డైరెక్టర్ దేవసేన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఈఓ కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. స్పౌజ్ కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లంతా డీఈవో కార్యాలయాల్లో ఆదివారం వెరిఫికేషన్‌కు రావాలని సూచించింది. అందరి ఆప్షన్లను వెరిఫికేషన్ చేసి అందులో నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్‌కు దూరంగా ఆప్షన్ ఇచ్చినవారందరినీ సమీపంలోని స్కూల్‌కు ఆప్షన్‌ను ఎడిట్ చేసుకోవాలని డీఈవోలు ఆదేశించారు. దీంతో అనివార్యంగా వారంతా సమీపంలోని పాఠశాల వద్దకు ఆప్షన్ ఇచ్చుకున్నారు. ఇష్టంలేనివారు 'నాట్ విల్లింగ్' ఇచ్చుకున్నారు. కరీంనగర్‌లో 56 మంది, జగిత్యాలలో 66 మంది, పెద్దపల్లి 33 మంది, సిరిసిల్లలో 37 మంది స్పౌజ్‌లు వెరిఫికేషన్ పూర్తిచేసుకున్నారు.

గోల్‌మాల్ ర్యాంకులు సరి

పదోన్నతులు, బదిలీ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాలలో పలు తప్పులు దొర్లాయి. కొందరు టీచర్లు తాము కోరుకున్న పదోన్నతి, ఇష్టమైన చోటుకు బదిలీ దక్కేలా చక్రం తిప్పారు. 317 జీవో అమలు సందర్భంగా డీఎస్సీ ర్యాంకును ప్రామాణికంగా కేటాయింపులు చేపట్టారు. ఇప్పుడు కూడా అవే ర్యాంకులు ప్రామాణికంగా తీసుకుంటున్నారని తెలుసుకున్న టీచర్లు.. తమ డీఎస్సీ ర్యాంకులను హెచ్ఆర్ఎంఎస్ సైట్‌లో తప్పుగా చూపించారు. ఈ విషయంలో కొన్ని జిల్లాల్లో ఉన్నతాధికారులను విజయవంతంగా తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలను 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. తప్పుడు ర్యాంకులు చూపిన టీచర్లకు నోటీసులు పంపి వివరణ కోరారు. అలాగే తప్పుగానమోదైన ర్యాంకులను తిరిగి సరిదిద్దుతున్నారు.

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు)

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2163
జగిత్యాల	25	685	2191
జగిత్యాల	31	334	681

- పై పట్టికలో చూపినవే కాకుండా పదుల సంఖ్యలో తప్పుగా నమోదుచేసిన ర్యాంకులను డీఈవో కార్యాలయాలు ఇప్పుడు సరిచేశాయి. 317 జీవో అమలు సందర్భంలో ఉన్న ర్యాంకులనే ఉంచి, వాటినే ప్రామాణికంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. తప్పుడు ర్యాంకులను సవరించి, పాత ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్న జగిత్యాల డీఈవో జగన్మోహన్‌రెడ్డికి ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

- మంత్రి కేటీఆర్‌ను కోరిన కౌశిక హరి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న హరి

గోదావరిఖని: అంతర్గాం మండలంలోని లింగాపూర్ గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక హరి కోరారు. ఈ మేరకు ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించిన బహిరంగ సభకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందించారు. బాధితులు మేడిపల్లి ఓసీపీ కింద భూములు, ఇళ్లు కోల్పోయారని తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని అప్పటి కలెక్టర్ చెప్పారన్నారు. కానీ ఇంతవరకు అమలు కాలేదని పేర్కొన్నారు. అలాగే, మహిళలకు కూడా కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వాలని విన్నవించారు.